వేగవంతంగా నాడు-నేడు పనులు

- ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంపై ఎందుకు కేసు నమోదు చేయలేదు
- పిచ్చాటూరు కళాశాల అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు-నేడు పనులను వేగవంతం చేసి నెలరోజుల్లో పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం కళాశాలలో నాడు-నేడు పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల మరుగుదొడ్ల గోడలను నిర్మించిన మరుసటి రోజే ఆకతాయిలు ధ్వంసం చేసిన విషయాన్ని అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ధ్వంసమైన గోడలను పరిశీలించిన ఎమ్మెల్యే పోలీసులకు ఫిర్యాదు చేశారా అని అధ్యాపకులను అడిగారు. ఆ రోజే (ఈ నెల 8న) పోలీసులకు ఫిర్యాదు ఇచ్చామన్నారు. అక్కడే ఉన్న హెడ్‌కానిస్టేబుల్ వెంకటముని కేసు నమోదు చేశారా.. అని ప్రశ్నించగా, కేసు నమోదు కాలేదని తెలిపారు. వెంటనే ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి తక్షణం కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే ఇంత నిర్లక్ష్యం ఎందుకని అసహనం వ్యక్తం చేశారు. కళాశాల వద్ద రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. నాడు-నేడు పనులు నెల రోజుల్లో పూర్తి చేయాలని, కళాశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్ శ్రీధర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద కళాశాల ఆవరణను చదును చేసి మొక్కలు నాటాలని ఎంపీడీఓ శ్రీనివాసులుకు ఎమ్మెల్యే సూచించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కేవీ చలపతిరాజు(పిచ్చాటూరు), అపరంజిరాజు(నాగలాపురం), రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, జేసీఎస్ కన్వీనర్ తొప్పయ్య, మోహన్, సర్పంచ్ సుగ్రప్రియ, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ చైర్మన్ ఎస్ఎం సురేష్, పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆర్ముగం రెడ్డి, నాయకులు చెంగల్రాయ రెడ్డి, సూరిబాబు రెడ్డి, బాబు రెడ్డి, మహేష్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.


ఆడుదాం ఆంధ్ర కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సంతాపం..

మండలంలోని నీరువాయి గ్రామానికి చెందిన క్రేన్ ఆపరేటర్ శ్యామ్యేల్(18) మృతదేహానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. శుక్రవారం తిరుపతి సమీపంలోని పేరూరు వద్ద ప్రమాదవశాత్తు క్రేన్ కింద పడి శ్యామ్యేల్ మరణించారు.

క్రీడల్లో గుర్తింపు తెచ్చుకోవాలి

నారాయణవనం: క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచే 'ఆడుదాం ఆంధ్ర'ను ఉత్సవంగా నిర్వహించనుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక కమ్యూనిటీ భవనంలో సచివాలయ కార్యదర్శులకు ఆడుదాం ఆంధ్ర ఆట వస్తువులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా బాలికలకు క్రీడల పట్ల ఆసక్తిని పెంచడంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం లేదన్నారు. గతంలో స్కూలు ముగిసిన అనంతరం సాయంత్రం 6 గంటల వరకు పిల్లలకు వివిధ ఆటలపై శిక్షణ ఇచ్చి ఆడించే వారని, నేడు 5 గంటలకే పాఠశాలలు తాళాలు వేసి పిల్లల కంటే ముందే ఉపాధ్యాయులు ఇళ్లకు చేరుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని 12 గ్రామ సచివాలయాల కార్యదర్శులకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కిట్లను అందజేశారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏవో గుణశేఖర్, ఎంఈవోలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, కైలాసకోన ఆలయ చైర్మన్ సుబ్రమణ్యం యాదవ్, ఏకాంబరం, అన్నాదొరై, ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


ధ్వంసమైన గోడలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కనులపండువగా ఊంజల్ సేవ


ఉయ్యాల సేవలో ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రముఖ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఊంజల్ సేవ నేత్రపర్వంగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం కావడంతో ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం కైంకర్యాలు పూర్తి అయిన తర్వాత శ్రీదేవి,భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింప చేశారు. అనంతరం ఊంజల్ మండపానికి వేంచేపు చేసి ఊయలలో కొలువుదీర్చారు. గంట పాటు ఉయ్యాల సేవలో స్వామి,అమ్మవార్లు సేదతీరుతుండగా భక్తులు దర్శించి తరించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గురువాయూర్‌లో ఎమ్మెల్యే మధు

శ్రీకాళహస్తి: శబరిమల యాత్రలో భాగంగా కేరళలోని గురువాయూర్ చిన్నికృష్ణస్వామి ఆలయాన్ని శనివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి, తీర్థప్రసాదాలు అందజేశారు. గురువాయర్ ఆలయ చైర్మన్ డాక్టర్ ఆనంద్ జ్ఞాపిక అందజేశారు.


ఆలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

బాధిత కుటుంబానికి సిపాయి భరోసా


సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కె.మునిచంద్రరెడ్డి కుటుంబానికి సిపాయి భరోసా కింద 40 రకాల నిత్యావసర సరుకులను ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం అందజేశారు. ఇటీవల మునిచంద్రారెడ్డి మృతి చెందారు. డాక్టర్ బాబు, మనోహర్‌రెడ్డి, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో దేవదాయ ముఖ్య కార్యదర్శి


ఆలయంలో కరికాల వల్లవన్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వల్లవన్ దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ కేఎస్ రామారావు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యతోనే సమాజంలో ఉన్నత స్థాయి

రేణిగుంట: చదువుతోనే సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోగలమని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. మండలంలోని గురవరాజుపల్లె ఎస్టీ కాలనీలో అనుబంధ పాఠశాలను ఆమె శనివారం ప్రారంభించారు. ఎస్టీ కాలనీకి చెందిన 30మంది విద్యార్థులు గ్రామానికి వెళ్లి చదువుకునేందుకు మార్గం మధ్యలో హైవే వంతెన రావడంతో రాక,పోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ నేపథ్యంలో డీఈవో అనుమతులతో ఇక్కడ అనుబంధ పాఠశాలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలను ఆమె ప్రారంభించి విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. పిల్లలను బాగా చదివించాలని, ఆ చదువే మీ తలరాతలను మారుస్తుందని ఆమె తల్లిదండ్రులకు సూచించారు. చిన్నారులకు చాక్లెట్లు పంచిపెట్టారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. లోఓల్టేజి సమస్య వల్ల విద్యుత్ సక్రమంగా సరఫరా కావడం లేదని తెలపగా, ట్రాన్స్‌కో ఏఈతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. అలాగే త్వరలోనే మిగిలిన వీధులకు కూడా సిమెంటు రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఎంఈవో ఇందిరాదేవి, ఎంఈవో-2 రంగనాథ్, సర్పంచ్ డి.షైనాజ్‌బీ, జువ్వల దయాకర్‌రెడ్డి, రహీం, నియోజకవర్గ రైతు సలహా మండలి చైర్మన్ శంకర్‌రెడ్డి, రహంతుల్లా, చిన్నబాబు, మీరా సాహెబ్, రాజా, అబ్దుల్లా, అల్లాబక్ష, నొర్దీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలను ప్రారంభిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

తుపాన్ బాధితులకు ప్రభుత్వం అండ


కేవీబీపురం: బాధితులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో తుపాన్ బాధితులకు తక్షణ సాయం అందిందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలో మిచాంగ్ తుపాన్ బాధితులకు శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో పరిహారాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి తనతో ప్రత్యేకంగా మాట్లాడి పరిస్థితులపై ఆరాదీశారని తెలిపారు. జరిగిన నష్టాన్ని వివరించడంతో బాధితులకు తక్షణ సాయం కింద బియ్యం, నిత్యావసర సరుకులు, 242 కుటుంబాలకు రూ.5.35 లక్షలను మంజూరు చేశారని పేర్కొన్నారు. మండలంలో దెబ్బతిన్న రోడ్లు, కాజువేలను ఇప్పటికే పునరుద్ధరించామని, పూడి కాజువే అభివృద్ధికి రూ.5 కోట్లతో టెండర్ పిలువనున్నట్లు వివరించారు. తుపాన్‌ను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు బాగా పనిచేశారని ఎమ్మెల్యే ప్రశంసించారు. వైఎస్సార్‌సీపీ పార్టీ మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య, ముఖ్య నేతలు నందకుమార్, లాల్‌బాబుయాదవ్, దశరథరామిరెడ్డి, మూర్తి సుబ్బయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, రామ్మోహన్, రమేష్, ఎంపీడీఓ రామచంద్ర, డీటీ మునిరత్నం పాల్గొన్నారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: మండలంలోని చింతలపాలెం ఎస్టీ కాలనీలో మిచాంగ్ తుపాన్ బాధితులకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్ శనివారం నగదు అందజేశారు. వర్షాలకు ఎస్టీ కాలనీలో 17 పూరి గుడిసెలు దెబ్బతిన్నాయి. ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.2500 పరిహారం మంజూరు చేసింది. అలాగే మండలంలోని పెనుమల్లం ఎస్టీ కాలనీలో దెబ్బతిన్న ఇళ్లకు వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి పరిహార నగదును అందజేశారు. సర్పంచ్ బాలప్రసాద్ యాదవ్, వీఆర్వో రవితేజ తదితరులు పాల్గొన్నారు.


ఏర్పేడు : సాయం అందిస్తున్న రమణయ్య యాదవ్

బీఎన్‌కండ్రిగ మండలంలో భారీ వర్షం


బుచ్చినాయుడుకండ్రిగలో రోడ్డుపై పారుతున్న నీరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శనివారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురుస్తోంది. ఈ వర్షంతో వరి, మిరప పంట రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆలత్తూరు, కొత్తకండ్రిగ, చిన్నయగుంట, పూసలపల్లె, ఆర్‌అనంతాపురం, గ్రామాలకు వెళ్లే రోడ్లు రొచ్చురొచ్చుగా తయారయ్యాయి. వరి రైతులు సాగుకు సిద్ధం అవుతున్నారు.

ఆలయంలో ఈఓ తనిఖీలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఈఓ కేఎస్ రామారావు తనిఖీలు నిర్వహించారు. పడితరం స్టోర్స్, లడ్డూ తయారీ విభాగం, అన్నదాన విభాగం స్టోర్స్, త్రినేత్ర గృహం, డార్మెటరీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి తగు సూచనలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


ప్రొఫెసర్ సరోజను సన్మానిస్తున్న ప్రిన్సిపాళ్లు

నారాయణవనం: సిద్ధార్థ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం బెస్ట్ టీచర్ అవార్డు వచ్చిన సందర్భంగా ఈసీ విభాగాధిపతి ప్రొఫెసర్ సరోజను ఘనంగా సత్కరించారు. ఇటీవల అనంతపురం జేఎన్‌టీయూ ఆమెను బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపిక చేసి, ప్రదానం చేసింది. ప్రిన్సిపాళ్లు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గోపీనాథ్ పాల్గొన్నారు.

పంచాయతీల్లో నగదు రహిత వసూళ్లు

సత్యవేడు: పంచాయతీల్లో ఇంటిపన్ను, ఇతర పన్నులు నగదు రహితంగా వసూలు చేయాలని సూళ్లూరు పేట డీఎల్‌పీఓ రవీంద్రబాబు తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం జరిగింది. డీఎల్‌పీఓ మాట్లాడుతూ పన్నులు క్యూఆర్ స్కానర్ ద్వారా చెల్లింపులు చేపట్టాలని సూచించారు. డిసెంబరు చివరికల్లా 30 శాతం, ఫిబ్రవరి లోపు 100శాతం పన్నుల వసూలు చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు సమగ్రంగా వినియోగించాలని సూచించారు. మండల పరిధిలోని పీవీపురం, అల్లవుగుంట, పెద్ద ఈటిపాకం, చిన్న ఈటిపాకం, కొత్తమారికుప్పం, శిరుణంబూదూరు, కాదిరివేడు, కొల్లడం, మల్లవారిపాళెం ఈస్టు, చెరివి, ఆరూరు, ఆంబాకం పంచాయతీల్లో ఆర్థిక సంఘం నిధులు పూర్తి స్థాయిలో వినియోగించకపోవడంపై ఆరా తీశారు. సాంకేతిక కారణాలతో పూర్తి స్థాయిలో నిధుల వినియోగం చేపట్టలేదని ఈఓపీఆర్డీ తెలిపారు. ప్రస్తుత వర్షాలకు ప్రతి పంచాయతీలో శానిటేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. నీరు నిల్వ ఉన్న చోట్ల దోమలు ప్రబలకుండా ఆయిల్ బాల్స్, మలాథిన్ స్ప్రే చేయించాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. 15 రోజులకు ఒకసారి ట్యాంకులను క్లోరినేషన్ చేసి తాగునీరు సరఫరా చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ మునిరవికుమార్, రిసోర్స్‌పర్సన్ ఆనందయ్య, సచివాలయ కార్యదర్శులు మాధవి, జలజశ్రీ, రజిత, ప్రకాష్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రవీంద్రబాబు

ఆలత్తూరు రోడ్డు ధ్వంసం



- అధ్వానంగా ఆలత్తూరు రోడ్డు
- 50 టన్నుల మెటల్ లారీలతో గుంతలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి గ్రామాలకు కేటీరోడ్డు నుంచి వెళ్లే రహదారి గుంతలమయమై అధ్వానంగా తయారైంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. కేటీరోడ్డు నుంచి ఈ గ్రామాలకు 18 కిలోమీటర్లు తారు రోడ్డు ఉంది. ఈ రోడ్డును 2016 వ సంవత్సరం ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద వేశారు. ఈ రోడ్డు వెంబడి క్రషర్లు, క్వారీలు ఉన్నాయి. క్వారీలు, క్రషర్ల నుంచి 50 టన్నులకు పైగా లోడ్‌తో లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు దెబ్బతింటోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రస్తుత వర్షాలకు భారీ గుంతలతో రహదారి అధ్వానంగా తయారవుతోంది. గ్రామస్తులు నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. వాహనదారుల బాధలు వర్ణనాతీతం. రోడ్డుపై గుంతలతో ఆర్టీసీ బస్సులను నడపడం ఆపేశారు. ఓవర్‌లోడ్డు మెటల్ లారీలు రోడ్డుపై తిరగకుండా చర్యలు తీసుకోవాల్సిన మైనింగ్, పోలీసు శాఖాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించాలని కోరుతున్నారు.


ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీ


ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు

కేవీబీపురం: మండల కేంద్రంలో ఇళ్ల స్థలాలు ఇవ్వనీయకుండా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే ఆదిమూలంకు ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదవర్గాల వారు విన్నవించారు. శనివారం మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేను ప్రజాప్రతినిధులతో కలసి పెద్ద ఎత్తున స్థానికులు కలిసి ఈమేరకు వినతి అదించారు. వారు మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయం పక్కనున్న సర్వేనంబర్ 53లోని భూమిని 2008లో అర్హులైన పేదవారికి ఇంటి నిర్మాణాల కోసం అప్పటి ప్రభుత్వం, అధికారులు కేటాయించారని తెలిపారు. ఆ స్థలంలో ఇప్పటికే వందలాది కుటుంబాలు నిర్మాణాలు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారని, మిగిలిన స్థలాన్ని పేదవారికి ఇవ్వాల్సి ఉండగా, స్థానిక టీడీపీ నేతలు కబ్జాచేసేందుకు ప్రత్నిస్తున్నారని పేర్కొన్నారు. వారికి మండల రెవెన్యూ అధికారులు కూడా ఒత్తాసు పలుకుతున్నారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే తహసీల్దార్‌తో మాట్లాడారు. ఆర్డీఓకు ఫోన్ చేసి భూమిని సర్వేచేసి అర్హత ఉన్నవారికి పట్టాలు ఇవ్వాలని సూచించారు.

టీడీపీ నేతల అత్యుత్సాహం..

సమస్యకు కారణమైన భూమిలోని సుమారు వంద ప్లాట్లను టీడీపీ నేతలు తమ ప్రభుత్వ హయాంలో నకిలీ పట్టాలు సృష్టించి అమ్ముకున్నారు. ఇప్పుడు పేదవారికి ఇవ్వాల్సిన భూమిని కబ్జా చేసేందుకు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాల్సిన స్థలమని బోర్డులు నాటారు. దీనిపై మీరు ప్లాట్లు అమ్ముకున్న సమయంలో ఎందుకు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు చొరవచూపి తమకు న్యాయం చేయాలని స్థానిక పేదలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతి బాధాకరం


నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

వరదయ్యపాళెం: పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం ఉపాధ్యాయ లోకానికి తీరనిలోటని యూటీఎఫ్ మండల కార్యవర్గం పేర్కొంది. శనివారం ఎమ్మార్సీ వద్ద సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తూ శ్రమించిన ఆయన మరణం బాధాకరమని తెలిపారు. యూటీఎఫ్ నాయకులు భగవాన్, శశికుమార్, వెంకటమోహన్, రుషేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్ధనారీశ్వర ఆలయ పనుల తనిఖీ


పనులను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధంగా ఉన్న పురాతన శ్రీఅర్ధనారీశ్వస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల ఆలస్యంపై ఆరా తీశారు. వచ్చే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల లోపు పనులు పూర్తి చేసి కుంభాభిషేకం నిర్వహించే విధంగా పనులు పూర్తి చేయాలన్నారు. గతంలో ఎకరా మాత్రమే ఉండేదని, ప్రస్తుతం 10 ఎకరాల పరిధిలో ఆలయం పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో సప్తగోశాల ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకు సంబంధించిన పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజుల పెళ్లూరు, నీర్పాకోట, తలారివెట్టు, కల్లివెట్టు, నెలవాయి, వేణుగోపాలపురం, కారణి, కుక్కంబాకం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద తహసీల్దార్ భార్గవి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, బీఎల్‌ఓలు ఈవీఎంల పనితీరుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈవీఎం, వీవీప్యాట్లను ఆన్‌చేసి ఓటు వేసే విధానాన్ని వివరించారు. బ్యాలెట్ యూనిట్‌లో తమకు నచ్చిన అభ్యర్థి పేరు, గుర్తు ఎదురుగా ఉన్న నీలి రంగు బటన్‌ను నొక్కాలని, అక్కడే ఉన్న ఎర్రబల్బు వెలిగి, బీప్‌మన్న శబ్దం వస్తే ఓటు వేసే ప్రక్రియ పూర్తి అయినట్లని వివరించారు. పక్కనే ఉన్న వీవీప్యాడ్ యంత్రంలో ఓటు వేసిన గుర్తు వివరాలు ఏడు సెకన్ల పాటు తెరపై కనిపిస్తుందని తెలిపారు. బీఎల్‌ఓలు వేంకటేశ్వరావు, తేజ, జగదీష్, ప్రసాద్, మోహన్, మురళి, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ కుటుంబాన్ని ఆదుకుంటాం

కేవీబీపురం: మండలంలోని సదాశివపురం సచివాలయ పరిధిలోని వడ్డికండ్రిగ గ్రామానికి చెందిన వలంటీర్ రవికుమార్(32) కుటుంబాన్ని ఆందుకుంటామని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. రవికుమార్ వారం కింటద గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం రవికుమార్ కుటుంబ సభ్యులను ఆదిమూలం పరామర్శించారు. రవికుమార్ భార్యకు వలంటీర్ ఉద్యోగం ఇప్పిస్తామని తెలిపారు. పిల్లలను కేవీబీపురం కేజీబీవీ, ఆదర్శపాఠశాలలో చేర్పిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్‌లు రామ్మోహన్ వర్మ, రాజేష్ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ-1 పరీక్షల్లో టాపర్లకు శనివారం బహుమతులు అందజేశారు. హెచ్ఎం నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు పోటీ పడి చదివి టాపర్‌లుగా నిలవాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి


గోపి (ఫైల్)

సత్యవేడు: స్థానిక వీఆర్ కండ్రిగ దళితవాడ సమీపంలో శుక్రవారం రాత్రి టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. మదనంబేడుకు చెందిన గోపి (40) అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తీసుకెళ్లగా అక్కడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



శ్రీకాళహస్తి: పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

రూ.లక్ష విరాళం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిత్యాన్నదాన పథకానికి సికింద్రాబాద్‌కు చెందిన దాత బాలాజీ శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు నగదు అందించారు. దాత, కుటుంబీకులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.